# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 06-04-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ దీనబంధు చోటు రామ్ తన జీవితాన్ని రైతులు, అణగారిన వర్గాల అభ్యున్నతికి అంకితం చేశారని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అన్నారు.
- ❖ అసోం రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ఎన్డీయే కూటమి కట్టుబడి ఉందని బీజేపీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.
- ❖ సైనికులకు అత్యుత్తమ ఆరోగ్య సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.
- ❖ మహిళలకు భద్రత కల్పించేందుకు దేశంలో పటిష్టమైన చట్టాలు ఉన్నాయని జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ విజయ రహత్కర్ అన్నారు.
- ❖ కోల్‌కతా వేదికగా పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్ల మధ్య జరుగుతున్న ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ కు వర్షం కారణంగా అంతరాయం ఏర్పడింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

దీనబంధు చోటు రామ్ తన జీవితాన్ని రైతులు, అణగారిన వర్గాల అభ్యున్నతికి అంకితం చేశారని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అన్నారు. హర్యానాలోని సోనిపట్ జిల్లా ముర్థాల్‌లో జరిగిన దీన్‌బంధు చోటు రామ్ సైన్స్ ఎండ్ టెక్నాలజీ విశ్వవిద్యాలయం 8వ స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అణగారిన వర్గాల సామాజిక-ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడంలోను, వారి గౌరవాన్ని పునరుద్ధరించడంలో దీనబంధు చోటు రామ్ కీలక పాత్ర పోషించారని అన్నారు. జీవితంలో గెలవడం అనేది కేవలం విజయాలతోనే కాకుండా అపజయాలను సైతం తట్టుకుని నిలబడగల సామర్థ్యంతో నిర్వచించబడుతుందని విద్యార్థులను ఉద్దేశించి చెప్పారు. విద్యార్థులు ఓర్పును అలవర్చుకుని, జీవితంలోని సవాళ్లను ధైర్యంగా, సానుకూల దృక్పథంతో ఎదుర్కోవాలని ఉపరాష్ట్రపతి సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

అస్సోం రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ఎన్డీయే కూటమి కట్టుబడి ఉందని బీజేపీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. అస్సోంలోని హోజాయ్‌లో ఈ రోజు జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధానమంత్రి మాట్లాడుతూ... ఒకప్పుడు విద్యుత్ కోసం ఇతర రాష్ట్రాలపై ఆధారపడిన అస్సోం.. ఇప్పుడు విద్యుత్ ఉత్పత్తిలో ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. విద్యుత్ లభ్యత పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేసి, కొత్త పెట్టుబడులను ఆకర్షిస్తుందని, నూతన పరిశ్రమల స్థాపనకు దారితీస్తుందని, తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని నరేంద్రమోదీ పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

ప్రధానమంత్రి అంతకుముందు బార్పేటలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తూ... అస్సోంలో బీజేపీ వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. గడిచిన పదేళ్ళుగా అస్సోంలో శాంతి, శ్రేయస్సు నెలకొని ఉన్నాయని, అసౌకర్యం, అభద్రత వంటి సవాళ్ల నుంచి రాష్ట్రం బయటపడిందని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

సైనికులకు అత్యుత్తమ ఆరోగ్య సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఆర్మీ మెడికల్ కార్ప్స్ రైజింగ్ డే సందర్భంగా న్యూఢిల్లీలో ఆయన ఈరోజు మాట్లాడుతూ... సైనికులు తీవ్రమైన ప్రతికూల వాతావరణ పరిస్థితులలో రాత్రింబవళ్ళు దేశానికి సేవలందిస్తారన్నారు. రీసెర్చ్ అండ్ రెఫరల్ హాస్పిటల్ వంటి సౌకర్యాలు దేశంలోని అన్ని మూలలా ఉండాలని, తద్వారా దళాలకు ప్రతిచోటా మెరుగైన వైద్య సౌకర్యాలు లభిస్తాయన్నారు. వైద్య దళాలకు వెన్నెముక వంటి మిలిటరీ నర్సింగ్ సర్వీస్ నర్సులకు పదవీ విరమణ, తర్వాత మాజీ సైనికుల హోదా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని రక్షణ మంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

మహిళలకు భద్రత కల్పిస్తూ.. వారి గౌరవాన్ని కాపాడేందుకు దేశంలో పటిష్టమైన చట్టాలు ఉన్నాయని జాతీయ మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ విజయ రహాత్కర్ అన్నారు. ఆకాశవాణి న్యూఢిల్లీలో ఈరోజు నిర్వహించిన మహిళా కేంద్రీకృత సమస్యలు, సాధికారత కార్యక్రమాల కార్యశాలలో ఆమె ప్రసంగిస్తూ.. ప్రతి మహిళా చట్ట ప్రకారం తమ హక్కులను వినియోగించుకోవాలని సూచించారు. కార్యాలయాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, నిషేధం, పరిష్కార చట్టం 2013, గృహ హింసను పరిష్కరించే చట్టాలను ప్రస్తావిస్తూ... ఈ చట్టాలపై మహిళలకు పూర్తి అవగాహన ఉంటే న్యాయం లభిస్తుందన్నారు. ఆకాశవాణి న్యూస్ సర్వీసెస్ డివిజన్ డైరెక్టర్ జనరల్ ధీరజ్ ఎం. కకాడియా మాట్లాడుతూ... పని చేసే ప్రదేశం సురక్షితంగా, న్యాయబద్ధంగా ఉండాలని, దోపిడీని ఏమాత్రం సహించరాని పరిస్థితి ఉండాలన్నారు. మహిళా సాధికారతపై చట్టపరమైన అవగాహనను వ్యాప్తి చేయడానికి, ఆకాశవాణి.. జాతీయ మహిళా కమిషన్‌తో కలిసి ఒక సంయుక్త కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన ప్రకటించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

భారతీయ జనతా పార్టీ సుపరిపాలనకు, అంత్యోదయ దార్శనికతకు ప్రతీకగా నిలిచిందని ఆ పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఆ పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన ఒక వీడియో సందేశాన్ని విడుదల చేస్తూ.. దేశానికి సేవ చేసే అవకాశం తనకు కల్పించినందుకు పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు. భారతదేశ రాజకీయాల్లో దేశమే ప్రథమం అనే కొత్త సూత్రాన్ని బీజేపీ నెలకొల్పిందన్నారు. మహిళా రిజర్వేషన్ల వాగ్దానాన్ని బీజేపీ నెరవేర్చిందని, 2029 ఎన్నికలు నారీ శక్తి వందన అధినియమ్ ప్రకారం జరిగేలా

ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ అంత్యోదయ దార్శనికతతో ప్రభుత్వం 25 కోట్ల మంది ప్రజలను పేదరికం నుండి బయటకు తీసుకురావడంలో విజయం సాధించిందన్నారు. ఉమ్మడి పౌర స్మృతి, ఒకే దేశం.. ఒకే ఎన్నిక.. వంటి అంశాలపై దేశంలో నేడు విస్తృతమైన చర్చలు జరుగుతున్నాయని నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియా సంఘర్షణల నేపథ్యంలో దేశంలో ఆహార ధాన్యాల నిల్వలు తగినంతగా ఉన్నాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. పశ్చిమాసియాలోని తాజా పరిణామాలపై న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన అంతర్-మంత్రిత్వ సమావేశంలో కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ అదనపు కార్యదర్శి అనుపమ్ మిశ్రా మాట్లాడుతూ... నిత్యావసరాల ధరలలో సాధారణ హెచ్చుతగ్గులు లేవని చెప్పారు. దేశంలో పప్పుధాన్యాల ఉత్పత్తి గత ఏడాది కంటే ఎక్కువగా ఉందని, ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను, సరఫరాను పర్యవేక్షిస్తోందని చెప్పారు. కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ సంయుక్త కార్యదర్శి సి. శిఖా మాట్లాడుతూ... దేశంలో గోధుమలు, బియ్యం రెండింటి బఫర్ స్టాక్ తగినంతగా ఉందని, సుమారు 602 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వంట నూనె, చక్కెర సరఫరా తగినంతగా ఉన్నాయని, ద్రవ్యోల్బణం అదుపులో ఉందని వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో పారిశ్రామిక కారిడార్‌ను అభివృద్ధి చేసి.. ఆ ప్రాంతాన్ని బ్లూ ఎకానమీ హబ్‌గా ప్రోత్సహించేలా ప్రణాళికలు రూపొందుతున్నాయని బీజేపీ సీనియర్ నాయకులు, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. మన్నడిపేట నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థికి మద్దతుగా తిరుక్కనూరులో ఈరోజు జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. పుదుచ్చేరిని పూర్తి అభివృద్ధి చెందిన ప్రాంతంగా మార్చేందుకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. పుదుచ్చేరిలో సంవత్సరానికి 3 లక్షల యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యంతో ఒక ల్యాప్‌టాప్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. గతంలో 47 శాతానికి పెరిగిన నిరుద్యోగ రేటు.. ఎన్డీయే ప్రభుత్వ హయాంలో గణనీయంగా 4.3 శాతానికి తగ్గిందని అమిత్ షా వివరించారు.

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

కోల్‌కతాలోని ఈడెన్‌గార్డెన్స్ వేదికగా పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన కోల్‌కతా నైట్ రైడర్స్ ప్రారంభంలోనే రెండు వికెట్లను కోల్పోయింది. 3.4 ఓవర్ల వద్ద వర్షం కారణంగా మ్యాచ్‌కు అంతరాయం ఏర్పడింది. అప్పటికి కోల్ కతా 25 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

భద్రత, సిగ్నలింగ్, కమ్యూనికేషన్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి భారతీయ రైల్వే.. 1,364 కోట్ల రూపాయల విలువైన పలు ప్రాజెక్టులను ఆమోదించిందని రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది. మంజూరైన పనులలో లోకోమోటివ్‌లపై కవచ్ ఏర్పాటు, ఆప్టికల్ ఫైబర్ కేబుల్ నెట్‌వర్క్ విస్తరణ, వివిధ రైల్వే జోన్‌లలో ప్యానెల్ ఇంటర్‌లాకింగ్ స్థానంలో ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేయడం వంటివి ఉన్నాయని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = =